

ఉప్పాడలో తీరంలో వెనక్కి వెళ్లిన సముద్రం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

నిత్యం సముద్రపు అలల తాకిడితో ఉండే ఉప్పాడ సముద్ర తీరంలో శుక్రవారం సముద్రపు అలలు ఒక్కసారిగా వెనక్కి వెళ్లడంతో తీర ప్రాంత వాసులు, వాహనదారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సముద్రం సుమారు 800 మీటర్లు వెనక్కి వెళ్లడంతో రానున్న రోజుల్లో పెనుముప్పు ఉంటుందేమోనని మత్స్యకార పెద్దలు ఆందోళన వ్యక్తం చేశారు.


ఉప్పాడ తీరంలో వెనక్కి వెళ్లిన సముద్రం

నిరాశాజనకంగా బడ్జెట్

- ప్రధాన సమస్యలు పట్టని ప్రభుత్వం
- అరకొర కేటాయింపులకే పరిమితం
- అభివృద్ధిని విస్మరించిన వైనం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 పూర్తి బడ్జెట్‌ను ఎపి అసెంబ్లీ సమావేశాల్లో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం ప్రవేశపెట్టారు. అయితే ఈ బడ్జెట్ మరోసారి జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. జిల్లా అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విదల్చకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా ఉంది. ధాన్యాగారంగా పేరు పొందింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగానికి, నీటిపారుదల రంగానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నా ఆ ఊసే లేదు. కేవలం రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టడానికి భారీగా లెక్కలు చెప్పినప్పటికీ ఆశించిన స్థాయిలో ఖజానాలో సొమ్ములు లేవు. సంపద సృష్టిపై దృష్టి సారిస్తామని చెప్పినప్పటికీ 8 నెలలు గడిచిపోయినా ఉపాధి అవకాశాలు లేవు. భారీ బడ్జెట్లో భాగంగా రెవెన్యూ లోటును, ద్రవ్య లోటును పొందుపరచారు. దీన్ని బట్టి ఈ లోటును పూడ్చడానికి ప్రజలపై భారీ ఎత్తున భారాలు మోపే అవకాశం కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాను విస్మరించిన వైనం

ఈ బడ్జెట్ కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు తగిన నిధులు కేటాయించకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్న సందర్భంలో ఈ బడ్జెట్‌పై జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు గాని, సాగునీటి పారుదల రంగానికి గాని ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదు. కోనసీమ రైల్వే లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతీ బడ్జెట్‌లోనూ నిరాశే ఎదురయ్యింది. కొత్త ప్రభుత్వమైనా నిధులు కేటాయిస్తుందని ఆశించినా నిరాశే మిగిలింది. ముఖ్యమైన పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధిపై కూడా కేటాయింపులు లేవు. కాకినాడ స్మార్ట్ సిటీ అభివృద్ధి వస్తావని రాలేదు. గోదావరి పుష్కరాలు త్వరలో జరగనున్నాయి. ఘట్ల అభివృద్ధి రహదారులు విస్తరణ వంటి పనులకు పెద్ద ఎత్తున నిధులను కేటాయించాల్సి ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్లో ఆ ప్రస్తావనే తీసుకురాలేకపోవడం గమనార్హం. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాను కొత్తగా ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భవనాలు పూర్తిస్థాయిలో లేవు. వాటి అభివృద్ధిపై బడ్జెట్లో ఎటువంటి ప్రస్తావన కనిపించలేదు.



కీలక ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కోసం కోనసీమ ప్రజానీకం గత 23 ఏళ్లుగా ఎదురు చూస్తున్న పరిస్థితి. కేంద్ర ప్రభుత్వం దఫదఫాలుగా రైల్వే బడ్జెట్‌లో మొత్తం రూ.1100 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటా ఇవ్వాల్సి ఉంది. గత వైసిపి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వం ఈ చిరకాల ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం వాటా సొమ్ములు కేటాయిస్తుందని ప్రజలు ఎదురు చూశారు. కానీ బడ్జెట్లో ఆ ప్రస్తావనే రాలేదు. దాంతో నిరాశ తప్పలేదు.

పరిశ్రమలకు మొండి చేయి

కాకినాడ సెజ్‌లో నేటికీ పరిశ్రమల జాడ కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వమైన పరిశ్రమలకు పూతమిస్తుందని, తద్వారా ఉపాధి లభిస్తుందని యువత ఎంతో ఆశిస్తున్నప్పటికీ ఈ బడ్జెట్లో పరిశ్రమలకు మొండి చేయి చూపారని జిల్లాకి చెందిన నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర డిప్యూటీ సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లాకు వట్టి చేయి చూపడంపై పెదవి విరుస్తున్నారు. స్వయానా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో భాగంగా ఉన్న కాకినాడ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుపై బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం విస్మయకరమని పలువురు కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే జల్ జీవన్ మిషన్ పనులకు అరకొర నిధులను మాత్రమే కేటాయించారు. కాటన్ బ్యారేజ్ తూర్పు, మధ్య డెల్టాలోని కాలువల అభివృద్ధికి అధికారులు గతంలోనే రూ.70 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఈ బడ్జెట్లో ఆ ప్రస్తావన రాలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదారుల బాగుకు అరకొర నిధులే..

జిల్లాలో ఉన్న పలు రహదారులు గత వైసిపి ప్రభుత్వంలో అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నిచోట్ల గుంతలను పూడ్చారు. దీంతో ప్రయాణికులకు కాస్త ఉపశమనం కలిగింది. శాశ్వత ప్రాతిపదికన రహదారులను నిర్మించాలంటే పెద్ద ఎత్తున నిధులు అవసరం ఉంది. ఈ బడ్జెట్లో రహదారుల కోసం అరకొర నిధులను మాత్రమే కేటాయించడంతో ఉమ్మడి జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు. మూడు జిల్లాల్లో సుమారు 250 కిలోమీటర్ల జాతీయ రహదారులు, 4,200 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రోడ్లు, 1100 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులు, 6,500 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్లు ఉండగా 60 శాతానికి పైగా మరమ్మతులకు గురై ఉన్నాయి.

నిరుద్యోగులకు నిరాశ

ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగ రేటు 17.5 శాతం ఉండగా వారికి నిరుద్యోగ భృతి కోసం వార్షిక బడ్జెట్ లో కేటాయింపులు చేయలేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 3 లక్షల మందికి పైనే నిరుద్యోగులు ఉన్నప్పటికీ ఉపాధి అవకాశాల కోసం గానీ, కనీసం నిరుద్యోగ భతిపై గానీ కేటాయింపులు లేవు. ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున గొప్పలు చెప్పిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని పలువురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సంక్షేమానికి తోడ్పడని బడ్జెట్

కాకినాడ రూ.3.22 లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా లేదని సిపిఎం కాకినాడ జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు విమర్శించారు. మరో రూ.80 వేల కోట్ల ద్రవ్య లోటును పూడ్చుకోడానికి ప్రజలపై అదనపు భారాలు వేసేదిగా ఉందన్నారు. పన్ను ఆదాయం రూ.14 వేల కోట్లు, పన్నేతర ఆదాయం రూ.12 వేల కోట్లు పెంచి చూపడం ద్వారా ప్రజలపై భారాలు వేసే బడ్జెట్ అన్నారు. అనుకున్న ఆదాయం రాలేదంటూ పథకాలకు కోత పెట్టే ప్రమాదముందని ప్రసాదరావు విమర్శించారు. ప్రజలకు పెను భారంగా మారిన విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల విధింపు గురించి ప్రస్తావించిన మంత్రి రాష్ట్రాన్ని 25 ఏళ్ల పాటు దోచుకు తినే సెకి ఒప్పందాన్ని రద్దు చేయడం గురించి పల్లెత్తు మాట అనలేదని విమర్శించారు. టిడిపి కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్న యువతకు నిరుద్యోగ భతి గురించి మాట మాత్రం ప్రస్తావించకపోవడం అన్యాయమని, ఇప్పటికే మెగా డిఎస్‌సి రాకపోవడం, గ్రూప్-2 పరీక్ష విషయంలో నిరాశ చెందిన యువతను ఈ బడ్జెట్ హతాశులను చేసిందన్నారు.

ఆక్వా అక్రమ సాగుపై రైతుల ఆందోళన

ప్రజాశక్తి -కరప

కరపలో అక్రమంగా రొయ్య చెరువుల సాగు యత్నాలున అడ్డుకోవాలని రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం స్థానిక తాహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు చెరువు తవ్వకాలు అక్రమ సాగుకు వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కరప గ్రామానికి చెందిన సలాది ఆదినారాయణ కుమారులు కాముట్ల పర్రగా పిలవబడే పొలాల వద్ద 10 ఎకరాల్లో వ్యవసాయ భూములను 2022లో ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రొయ్యల చెరువులు తవ్వించారని, రైతులు వ్యతిరేకించడంతో చెవురువును యథావిధిగా వ్యవసాయ భూములుగా మార్చుకుంటామని చెప్పారన్నారు. ప్రస్తుతం దంగేటి గోవిందు అనే వ్యక్తి రొయ్యల సాగుబడికి ప్రయత్నాలు చేస్తున్నారని రైతులు అభ్యంతరం తెలిపినా వారి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఉన్న చెరువుల వల్ల అనేక నష్టాల బారిన పడుతున్నామని, ఈ చెరువులు సాగులోకొస్తే పంట కాలువలు కాలుష్యం బారిన పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కోరుపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఇబ్బందులకు గురవుతామన్నారు. అనంతరం మత్స్యశాఖ, ఇరిగేషన్, డ్రైనేజీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఆందోళనలో రైతులు పుణ్యమంతుల గంటయ్య, చిన్నారి శ్రీను, అనిశెట్టి సత్తిబాబు, నూకల సూరిబాబు, రెడ్డి బుజ్జి పాల్గొన్నారు.


కరప తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు



టోర్నమెంట్- 2025 పోటీలలో విజేతలు

ముగిసిన సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నీ

ప్రజాశక్తి-కాకినాడ

గత 14 రోజుల నుంచి సాగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్-2025 పోటీలు శుక్రవారంతో ముగిశాయి. కాకినాడలోని జెఎన్‌టియుకె గ్రౌండ్లో నిర్వహించిన ఈ పోటీల్లో ఈ హాకీ పోటీల్లో మహిళా విభాగంలో ఒడిశా, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల జట్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజయం సాధించగా పురుషుల విభాగంలో ఢిల్లీ, ఆంధ్ర, తెలంగాణ, హర్యానా జట్లు వరుసగా మూడు స్థానాల్లో విజయం సాధించాయి. అనంతరం గ్రౌండ్‌లో ముగింపు వేడుకలను నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు మెమెంటోలు, ట్రోఫీలు అందజేశారు. గెలుపొందిన విజేతలకు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ భావన, క్రీడలకు సహకరించిన ఆయా కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

సమస్యలపై 6న ఆశాల ధర్నా

ప్రజాశక్తి-కాకినాడ

తమ సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్స్ మార్చి 6న చేపట్టిన ధర్నాను జయప్రదం చెయ్యాలని కోరుతూ స్థానిక సిఐటియు ఆఫీస్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వక్తలు పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు జి.బేబీరాణి మాట్లాడుతూ ఆశా వర్కర్స్ సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు జరిగి ఒప్పంద కాపీని విడుదల చేసి సంవత్సరం దాటినా నేటికీ ప్రభుత్వం జిఒలు విడుదల చేయలేదన్నారు. కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ సెలవులు, క్యాజువల్ లీవ్స్, వేతనంతో కూడిన మెటర్నటీ లీవ్, రికార్డ్స్, వయోపరిమితి 62కు పెంపు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, బీమా, మట్టి ఖర్చులు తదితర ఒప్పంద జిఒల కోసం అనేక ఏళ్లుగా పోరాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ, నాయకులు నొక్కు లలిత, నాగలక్ష్మి, అంకాడి పద్మావతి, భారతిప్రియా, లక్ష్మి, అనంతలక్ష్మి, మంగరత్నం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బేబీరాణి

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలో ఇళ్లు నిర్మించుకోవడానికి టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాన్ అప్రూవల్ ఇవ్వడం లేదని డబ్బు కోసం కక్కుర్తి పడుతున్నారని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. శుక్రవారం నగర పంచాయతీ చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షత నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు లేఔట్‌లు, నాన్ లేఔట్ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయలేదని, ప్రజలు ఇళ్లు కట్టుకోవడానికి ప్లాన్ అప్రూవల్‌కు దరఖాస్తు చేస్తే ఇవ్వడం లేదని ధ్వజమెత్తారు. ఇటీవల శానిటేషన్ స్టోర్ రూమ్ దగ్ధం అయ్యి స్టోర్ రూమ్‌లో సానిటరీ సామాన్లు కాలిపోయని, మిషన్ల ఖరీదు ఎజెండాలో పెట్టలేదని, పట్టణంలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదని వైస్ చైర్మన్ తెడ్లపు అలేఖ్య రాణి, కౌన్సిర్లు గంటా అప్పలస్వామి, గుళ్ల సుబ్బారావు లేవనెత్తారు. కమిషనర్ ఎస్.కనకారావు మాట్లాడుతూ నగర పంచాయతీ ప్లాన్ అప్రూవల్ ఎల్‌టిపి ద్వారా మాత్రమే ప్లాన్ పెట్టుకోవాలని, వీధి దీపాలకు త్వరలోనే టెండర్లు పిలుస్తామని తెలిపారు. వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరావు, కౌన్సిలర్లు గంద్రేటి శ్రీరామచంద్రమూర్తి, బి.సత్తిబాబు, మేనేజర్ నవీన్ చంద్ర, ఎఇ ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రాంతీయ భాషలను మింగేస్తున్న హిందీ


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

హెల్పింగ్ హ్యాండ్స్ రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-రౌతులపూడి

మండల గ్రామమైన రౌతులపూడిలో హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి 48 మంది యువకులు స్వచ్ఛందంగా హాజరై రక్తదానం చేశారు. ఆపద సమయంలో రోగులకు రక్తాన్ని అందించి వారి ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా హెల్పింగ్ హాండ్స్ సంస్థను ప్రారంభించామని తెలిపారు. ఏడుటా రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తాన్ని సేకరించి జిల్లా కేంద్రమైన కాకినాడ, తుని ప్రాంతాలకు అందజేస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో హెల్పింగ్ హాండ్స్ కోరిన సమయంలో వారు రక్తాన్ని అందజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు విజయ్, శివ ప్రసాద్, సలీం, జగదీష్, ఎస్ శ్రీను ఉన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

ఎపి రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ యాళ్లవారి గరువులో డాక్టర్ ఎస్ఆర్‌కె మున్సిపల్ ఉన్నత పాఠశాల, శ్రీరామనగర్‌లో మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ క్విజ్, సైన్స్ నమూనా ప్రదర్శన, వ్యాసరచన పోటీలు, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామనగర్ పాఠశాల హెచ్ఎం ఎండి.రబ్బానీ, యాళ్ళవారి గరువు పాఠశాల హెచ్ఎం పిఎస్ఎన్.మూర్తి, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జి.కిషోర్‌కుమార్, ఎస్.కృష్ణంరాజు, ఎస్.గోవిందరాజులు, ఇమ్మాన్యుయేల్, బి.అర్జున్ రావు, జి.రాజబాబు పాల్గొన్నారు.

కరప గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జిల్లా పరిషత్ హైస్కూల్లో జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్ఎం ఎం.సాయి మోహన్ ఆధ్వర్యంలో సైన్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు గ్రేడ్ల కోసం కాకుండా, సృజనాత్మకంగా ఆలోచించి, నైపుణ్యాలు మెరుగుపరుచుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. రామన్ ఎఫెక్ట్ కనుగొనడంతో 1930లో ఆసియా ఖండంలోనే భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని భారతదేశానికి అందించారని ఉపాధ్యాయులు తెలిపారు. స్టాఫ్ సెక్రెటరీ ఐ.ప్రసాదరావు, వివి.రమణమూర్తి, వేణుగోపాలరావు, ప్రభారాణి, భవాని, శరత్, మాణిక్యాంబ, అర్జున్ రావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు సుంకరపాలెంలోని నల్లం హైస్కూల్లో చైర్మన్ నల్లం నాగబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైన్స్ అండ్ మ్యాథ్స్ ప్రాజెక్టుల ప్రదర్శనను ఎంఇఒ ఎ.మంగాయమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు ప్రయోగాలు తోటి విద్యార్థులను ఆలోచింపజేశాయి. ఈ సందర్భంగా 200 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు జి.సుబోష్ కుమార్, కె.ఈశ్వరరావు, ప్రిన్సిపల్ డి.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ సుమని, ఉపాధ్యాయులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సామర్లకోట ప్రతిభ పాఠశాలలో కాస్మో క్లిక్ వైజ్ఞానిక ప్రదర్శన చూపరులను ఆలోచింపజేసింది. పాఠశాల ఫౌండర్ కరస్పాండెంట్ ఎస్‌విజి.ప్రకాష్ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు సైన్స్, గణితం, సోషల్, రోబోటిక్, వైద్య, పర్యావరణ, సాంకేతిక రంగాల్లోని అవగాహన, సందేశాత్మక విషయాలను, ప్రయోగ నమూనాలు, క్రీడా వినోదాత్మక విభాగాలుగా సుమారు 170 అంశాలతో అద్భుతంగా తయారుచేసి ప్రదర్శించారు. ఆర్ట్ గేలరీ కూడా అందర్నీ ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుధారాణి ప్రకాష్, ప్రిన్సిపల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీగౌరి పాల్గొన్నారు. సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్లో సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, ఉపాధ్యాయులు ఘనంగా నివాళి అర్పించారు. ఇన్‌ఛార్జి హెచ్ఎం రాజు, సీనియర్ సైన్సు ఉపాధ్యాయిని ఎఎల్‌వి.కుమారి, సైన్స్ టీచర్ కె.శ్రీనివాసు పాల్గొన్నారు.



కాకినాడలో విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఉపాధ్యాయులు

శంఖవరం రైల్వే స్టేషన్ రహదారిలోని శ్రీశారద విద్యాలయంలో విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాలైన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.కరస్పాండెంట్ కృష్ణవర్మ తెలిపారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

కత్తిపూడి మాధురి విద్యాలయంలో చైర్మన్ కడారి తమ్మయ్య నాయుడు, సతీమణి సీతాదేవి ఆధ్వర్యంలో సైన్స్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టద్యార్థులు సైన్స్ పరంగా సాంకేతిక పరంగా తయారు చేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆదినారాయణ పాల్గొన్నారు.

జగ్గంపేట శ్రీచైతన్య స్కూల్లో ముఖ్యఅతిథిగా జగ్గంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీనివాస్, రాజమండ్రి శ్రీచైతన్య జోనల్ ఎజిఎం ఎంవి.సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు రామానుజన్ వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, జగ్గంపేట శ్రీచైతన్య ప్రిన్సిపల్ జి.శ్రీనివాస్, డీన్ నాగేంద్ర, సిబ్యాచ్ ఇన్‌ఛార్జి దుర్గాప్రసాద్, ఎఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

గొల్లప్రోలు పట్టణంలో మెయిన్ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సైన్స్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత సివి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్కూల్ హెచ్ఎం సిహెచ్.సూర్య ప్రకాశ్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ సిహెచ్‌యుఆర్ మంగతాయారు మాట్లాడారు.


కత్తిపూడి మాధురి విద్యాలయాల్లో ఘనంగా జరిగిన సైన్స్ ఫెయిర్ వేడుకలు


సామర్లకోటలో విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు

ఘనంగా ప్రపంచ టైలర్స్ దినోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం, కాకినాడ రూరల్

కుట్టు మిషన్ సృష్టికర్త విలియంహౌ జయంతి సందర్భంగా పెద్దాపురంలో శుక్రవారం ప్రపంచ టైలర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ముప్పన వారి బంగళాలో శుక్రవారం జరిగిన టైలర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో విలియం హౌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ కుట్టు మిషన్ ఆవిర్భావంతో ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందిన ఉపాధి రంగం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సీనియర్ టైలర్స్ ఆకాశపు భద్రరావు, గౌరి రామమూర్తి, ఇమంది సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. అనంతరం మెయిన్ రోడ్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ అధ్యక్షులు గుడివాడ కనక రత్నం, నాయకులు అల్లాడ రాఘవరావు, ఆకాశపు సత్యనారాయణ, జిలగం సత్తిబాబు, అల్లక వీరభద్రరావు,సకురి కనకారావు, ముతిక వెంకటేశ్వరరావు, ఎర్రా దుర్గారావు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ వస్త్ర ప్రపంచంలో వచ్చిన వివిధ ఫ్యాషన్‌లతో దుస్తులు లభించడంతో దర్జీలకు ఉపాధి కరువైందని దర్జీ అల్లం కుమార్ రాజా ఆవేదన వ్యక్తం చేశారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ దర్జీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడీమేడ్ వస్త్రాలు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి రావడంతో సాంప్రదాయ దుస్తులు కుట్టించుకునేవారు క్రమేపీ తగ్గిపోతున్నారని అన్నారు. ఈ వృత్తిపై ఆధారపడిన దర్జీలకు ప్రభుత్వం బ్యాంకు రుణాలు అందించడంతోపాటు కరెంటు ఛార్జీలలో రాయితీలు ఇవ్వాలని, 50 ఏళ్లు పైబడిన దర్జీ పని వారికి పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో కుమార్ రాజాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, రవిశంకర్ పట్నాయక్, రాజా, పేరయ్య కాపు, రాయుడు త్రిమూర్తులు, రామచంద్రరావు, ఎస్.శ్రీనగేష్ పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి : పీడీ

ప్రజాశక్తి - సామర్లకోట

మున్సిపాలిటీ పరిధిలో గుర్తించిన నిరాశ్రయుల సంఘాల బలోపేతానికి మెప్మా సిబ్బంది అన్ని విధాలా కృషి చేయాలని మెప్మా పీడీ బి.ప్రియంవద సూచించారు. స్థానిక మెప్మా కార్యాలయంలో మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల రిసోర్స్ పర్సన్స్‌కు శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎస్‌హెచ్‌జి ప్రొఫైలింగ్‌ను 100 శాతం పూర్తయినందున ఆర్‌పిలను అభినందించారు. నిరాశ్రాయుల గ్రూపుల తయారీలో భాగంగా భవన నిర్మాణ కార్మికులు, రవాణా రంగంలో పని చేస్తున్న కార్మికులు, గహాల్లో పనిచేస్తున్న వర్కర్లు, వ్యర్థాలు సేకరించుకుని జీవించే కార్మికులకు గ్రూపులను ప్రారంభించినట్లు సమీక్షలో సిబ్బంది వివరించారు. బిఎస్‌సి హౌసింగ్‌లో లబ్ధిదారుల వాటా ఇంకా బకాయి ఉన్నందున త్వరగా కట్టించేలా చర్యలు చేపట్టాలని పీడ సిబ్బందికి సూచించారు. ఇప్పటి వరకు పట్టణ పరిధిలో గుర్తించిన ఎలక్ట్రీషియన్‌లు, ప్లంబర్లు, వడ్రంగి పనివారు, బ్యూటీషియన్స్‌కు శిక్షణ ఇప్పించేందుకు సిద్ధం చేయాలని, ఎస్‌హెచ్‌జి, ఎస్‌ఎల్‌ఎఫ్, టిఎల్‌ఎఫ్‌లకు రోజు వారీ సమావేశాలు, పుస్తక నిర్వహణ, కట్టుబాట్లు సక్రమంగా నిర్వహించాలని పీడీ సూచించారు.

నేరాలు ఘోరాలు

ఆటో ఢీకొని యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మోటార్ సైకిల్ పై వెళుతున్న వ్యక్తిని ఆటో ఢీకొన్న ఘటనలో ఒక అతను తీవ్ర గాయాల పాలైయ్యాడు. శుక్రవారం దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అయినాపురానికి చెందిన ఇళ్ళ సూర్య వెంకట నాగమల్లేశ్వరరావు మామిడికుదురు జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్ గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం మోటార్ సైకిల్పై ఇంటికి వస్తుండగా బొండాయి కోడు తూము వద్ద అతనిని ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన నాగమల్లేశ్వరరావు ను కాకినాడలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. నాగమల్లేశ్వరరావును ఢీ కొట్టి ఆటోతో పరారైన ఆటో డ్రైవర్ ను ముమ్మిడివరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ శేఖర్

ఆలయంలో ఆభరణాల చోరీ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మండలంలోని సవరపాలెం శ్రీ సత్య నారాయణ స్వామి గురువారం రాత్రి ఆలయంలో చోరీ జరిగిందని శుక్రవారం అమలాపురం పోలీసులకు ఆలయ అర్చకులు దొంతుకుర్తి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. 8 కిలోల వెండి ఆభర ణాలు చోరీ అయినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ మేరకు తాలూకా ఎస్ఐ వై.శేఖర్ బాబు, తాలూకా పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి డాగ్ స్క్వాడ్తో చుట్టుపక్కల ప్రాంతాలలో దర్యాప్తు చేపట్టారు.

అక్రెడిటేషన్ల గడువు మరో మూడు నెలల పొడిగింపు

ప్రజాశక్తి - అమలాపురం

మీడియా అక్రెడిటేషన్ కార్డుల వ్యాలిడిటీని మరో మూడు నెలల పాటు పొడిగించారని జరిగిందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ నుంచి జిల్లాకు సమాచారం అందిందన్నారు. ఈ నిర్ణయం మేరకు అక్రిడిటేషన్ కార్డుల వ్యాలిడిటీని మార్చి 1వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు (లేదా) కొత్త కార్డులు జారీ చేయడం గాని ఏది ముందు జరిగితే అప్పటివరకు కార్డుల వ్యాలిడిటీని పొడిగించారన్నారు.

యానాం వార్తలు

మున్సిపాలిటీ స్థలంపై లెఫ్ట్నెంట్ గవర్నర్ కు ఫిర్యాదు

ప్రజాశక్తి - యానాం

యానాం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని మున్సిపాలిటీకి చెందిన 664 మీటర్ల స్థలం మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావుకు అమ్మడం సరికాదని,ఆ స్థలాన్ని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి దఖలు పరచాలని కోరుతూ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాథన్కు ఫిర్యాదు చేసినట్టు మాజీ ఎంఎల్ఏ వెలగా రాజేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్థలం 500 ఏళ్లుగా దేవస్థానం ఆధీనంలోనే ఉందన్నారు. ఇప్పటి వరకు ఆ స్థలాన్ని వాహనశాలగా ఉపయోగించినట్టు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు ఆ స్థలం అవసరం అన్నారు. ఆ స్థలం అమ్మడం సరికా దని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన కాపీ లను పుదుచ్చేరి లోకల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, పుదు చ్చేరి హెచ్ఆర్ఐ కమిషనర్కు పంపినట్టు తెలిపారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాంలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మెట్టకూరు రీజెన్సీ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయులు టివిఎస్ఎస్వి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు విద్యార్థులు శాస్త్రవేత్తల వేషధారణలో అలరించారు. సైన్స్ నమూనాలను, శాస్త్రవేత్తల ఫోటోలను ప్రదర్శించారు. విద్యార్థులకు పలు అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇన్చార్జ్ సిహెచ్.వీరభద్రం, ఉపాధ్యాయులు కె.క్రాంతి కుమార్, సిహెచ్.అశ్విని, పివి.వరలక్ష్మి, ఎం.ఉష రామలక్ష్మి, ఎం.రహిమా, ఐ.భాస్కరమని పాల్గొన్నారు. స్థానిక నల్లం రెసిడెన్షియల్ కాన్సెప్ట్ స్కూల్లో చైర్మన్ నల్లం నాగబాబు ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ వేడుకలు ఘనంగా జరిగాయి.

ఘనంగా టైలర్స్ డే

ప్రజాశక్తి - యానాం

శ్రీవిఘ్నేశ్వర టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే 30వ వార్షికోత్సవాన్ని స్థానిక బెజవాడ గార్డెన్స్లో అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్ఎఒ మునిస్వామి పాల్గొన్నారు. పలువురు వక్తలు టైలర్స్ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సంఘం ప్రెసిడెంట్ తిక్కిరెడ్డి సత్యానందం మాట్లాడుతూ టైలర్స్ సంఘం అభివద్ధికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణారావు రూ.2 లక్షలు ఇచ్చారన్నారు. ఎంఎల్ఏ గొల్లపల్లి శ్రీనివాస అశోక్ రూ.2 లక్షల 25 వేలు ఇచ్చారన్నారు. సంఘ సభ్యులకు 5 కుట్టుమిషన్లు, అనారోగ్య బారిన పడిన టైలర్ రాచకొండ శ్రీనివాసరావుకు రూ.25 వేల సాయం అందించార న్నారు. సంఘ సభ్యులు నేమాల లక్ష్మీనారాయణ కనకాలపేట గ్రామ శివారులో 100 చదరపు మీటర్ల స్థలాన్ని సంఘానికి విరాళంగా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో డిటి జ్యోతి వెంకటేశ్వరరావు, మాజేటి సత్యభాస్కర్, నల్లా వెంకన్న, మల్లాడి విష్ణుమూర్తి, చిక్కం కృష్ణారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'పాడా' కార్యాలయం ఏర్పాటుపై నిరసన

తప్రజాశక్తి-పిఠాపురం

మున్సిపల్ గెస్ట్ హౌస్లో పుడా కార్యాలయం ఏర్పాటు చేయడంపై వైసిపి కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కౌన్సిల్లో బైఠాయించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్పర్సన్ గండేపల్లి సూర్యవతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. తొలుత ఇటీవల మృతి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్ఆర్.మూర్తికి సంతాపం తెలిపారు. అనంతరం అజెండా చదువుతున్న సమయంలో రెండో వార్డు కౌన్సిలర్ సోమరౌతు లలిత మాట్లాడుతూ పట్టణంలోని మున్సిపల్ గెస్ట్ హౌస్లో పాడా (పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ) కార్యాలయం ఏర్పాటు చేసేందుకు ఎవరు అనుమతిచ్చారని, కౌన్సిలర్లకు తెలియకుండా నిర్ణయం తీసుకోవడం ఏమిటని మున్సిపల్ కమిషనర్ కనకారావును ప్రశ్నించారు. తాము కౌన్సిలర్లుగా 50,000 మంది ప్రజలు ఎన్నుకుంటే ఇక్కడకు వచ్చామన్న విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. కౌన్సిలర్లు అంటే గౌరవం లేకుండా పోయిందని, కనీసం సమాచారం ఇవ్వకుండా పనులు చక్కబెడుతున్నారని, పాడా కార్యాలయం ఏర్పాటు చేస్తున్నామంటూ అక్కడ ఉన్న సచివాలయాన్ని పాఠశాలకు తరలించారని, మున్సిపల్ గెస్ట్ హౌస్ బయట చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారిని, కార్ స్టాండ్ను అక్కడ నుంచి వెళ్లిపోవాలంటున్నారని, ఇవన్నీ కౌన్సిలర్లకు చెప్పకుండా చేయడంపై కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని 7వ వార్డు కౌన్సిలర్ బోను దేవా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని టేబుల్ అజెండాగా తీసుకురావాలని చైర్మన్ పోడియం ముందు బైఠాయించారు. ఈ సదర్భంగా కమిషనర్ సమాధానమిస్తూ పిఠాపురంలో పాడా (పిఠాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ) కార్యాలయం ఏర్పాటు విషయమై జిల్లా ఉన్నతాధికారులు పిఠాపురంలో కొన్ని ప్రాంతాలను, కార్యాలయాలను పరిశీలించారని, ఎంతో కాలంగా నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ గెస్ట్ హౌస్ను అనువైన కార్యాలయంగా ఎంపిక చేశారని, మున్సిపల్ గెస్ట్ హౌస్లో పాడా కార్యాలయం ఏర్పాటు ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందని తెలిపారు. అనంతరం చైర్పర్సన్ ఆదేశాలతో టేబుల్ ఆజెండాగా అంశాన్ని తీసుకువచ్చారు. టిడిపి కౌన్సిల్ సభ్యులు అల్లవరపు నగేష్ అజెండా పత్రాన్ని చించివేసి టిడిపి సభ్యులంతా కౌన్సిల్ సమావేశం నుంచి వాకౌట్ చేశారు.



పోడియం ముందు బైఠాయించిన వైసిపి కౌన్సిలర్లు

మంత్రి పవన్ కృషితో పల్లెల అభివృద్ధి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

గ్రామీణాభివృద్ధి, పంచాయతీ వ్యవస్థలను పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ గాడిలో పెట్టడంతో నేడు పల్లెల్లో అభివద్ధి పరుగులు పెడుతోందని మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 15వ ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లింపు, స్టాంపు డ్యూటీ నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయతీలు అభివృద్ధిలో వెనుకబడ్డాయన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు కూడా సరిగా వినియోగించలేని దుస్థితి నెలకొందన్నారు. మంత్రి పవన్ కళ్యాణ్ కృషితో రాష్ట్రంలో ఒకేరోజు 13,326 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రత్నప్రసాద్

2న హుస్సేన్పురంలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

హుస్సేన్పురంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు చల్లా బుజ్జి ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో పంచాయతీ కార్యాలయం వద్ద పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ శిబిరానికి వచ్చే ప్రజలు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, పాత మెడికల్ రిపోర్ట్లు, ఫోన్ నెంబరు తీసుకుని రావాలని తెలిపారు. సామర్లకోట పరిసర ప్రాంత ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని బుజ్జి కోరారు.

మంత్రి లోకేష్కు ఎంఎల్ఎ సత్యప్రభ వినతి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ను ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ శుక్రవారం అసెంబ్లీ సమావేశాలు అనంతరం కలిశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, అదనపు తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గదుల నిర్మాణానికి, పాఠశాలలో ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, అంగన్వాడీ భవనాల నిర్మాణాలు నిధులు లేక అసంపూర్తిగా ఉండటంతో అంగన్వాడీ కేంద్రాలు అద్దె ఇంట్లో నడుస్తున్నాయని నిధులు మంజూరు చేసి నియోజకవర్గ అభివద్ధికి సహకరించాలని మంత్రి లోకేష్ను కోరారు.

శ్యామలాదేవి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పెద్దాపురం

పంచాయతీ కార్యదర్శిగా సిహెచ్.శ్యామలాదేవి చేసిన సేవలు మరువలేనివని ఎంపిడిఒ డి.శ్రీలలిత అన్నారు. పెద్దాపురం మండలం ఆనూరు పంచాయతీ కార్యదర్శి సిహెచ్.శ్యామలాదేవి ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన అభినందన సభకు ఆమె అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్యామలాదేవి పంచాయతీ కార్యదర్శిగా అధికారులకు ప్రజా ప్రతినిధులకు మధ్య అనుసంధానంగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం శ్యామలాదేవిని పంచాయితీ కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాలలు, సాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఎఒ గౌరీ శంకర్, కోరుకొండ ఎంపిడిఒ బి.అశోక్ కుమార్, ఇఒపిఆర్డిలు బివివి.రమణ, జెవిఆర్.రామకృష్ణ, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ సభ్యులు ఎన్.సత్యనారాయణ, ఈశ్వరరావు, భార్గవ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ శిక్షణ

ప్రజాశక్తి-పిఠాపురం

ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆదేశాల ప్రకారం పిఠాపురం స్కిల్ హబ్ ద్వార నిరుద్యోగులకు అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సుల శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు పిఠాపురం స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ రేవతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రకటనలో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్కు ఉచితంగా ప్రస్తుత ఉన్న నూతన సాంకేతికతను ఉపయోగించి, ఇండస్ట్రీ నైపుణ్యత ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. పిఠాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల స్కిల్ హబ్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఆపైన చదివిన వారు అర్హులని, విద్యార్థినీ, విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాగునీరు అందించాలని వినతి

ప్రజాశక్తి- సామర్లకోట

సామర్లకోట మున్సిపాలిటీ 13వ వార్డు బలుసులపేటలో తాగునీటి పైపులైను మూసుకుపోయి రెండు రోజులుగా తాగునీటికి ఇబ్బంది కలుగుతున్నందున పైపులైనుకు తక్షణమే మరమ్మతు పనులు చేపట్టి రక్షిత తాగునీరు అందించాలని ఆ ప్రాంతానికి చెందిన ప్రజలు అధికారులకు విన్నవిస్తున్నారు. 13వ వార్డు బలుసుల పేటలో 50 కుటుంబాలు నివాసముంటున్న ప్రాంతంలో కుళాయిల ద్వారా తాగునీరు అందించే పైపులైను మూసుకుపోయి రెండు రోజులుగా కుళాయిల్లో తాగునీరు రావడం లేదని ఆ ప్రాంతానికి చెందిన టిడిపి నాయకులు కాళ్ల రవీంద్ర శుక్రవారం తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం ట్యాంకర్ ద్వారా మంచి నీటిని అందించినట్టు చెప్పారు. అయితే తక్షణమే పైపులైనుకు రిపేరు పనులు చేపట్టి రక్షిత తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని ఈ సందర్భంగా ఆ ప్రాంతానికి చెందిన ప్రజల అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిజియోథెరపీ మిషన్ అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో వికలాంగ బాలలకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ నిమిత్తం పెద్దాపురం ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫిజియోథెరపీ సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు ఎస్.విశాలాక్షి మాట్లాడుతూ ఇన్నర్ వీల్ క్లబ్ ద్వారా ఎన్నో సేవలందిస్తున్నామన్నారు. భవిత కేంద్రంలో బాలలకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను చూసి ఈ సేవలకు తోడ్పడే విధంగా జి.సీతారామయ్య పేరున ఫిజియోథెరపీ మిషన్ను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు బి.స్వరాజ్యలక్ష్మి, డి.అన్నపూర్ణ, ఫిజియోథెరపిస్టు బి.అపర్ణ, భవిత కేంద్రం సిబ్బంది బి.దుర్గాప్రసాద్ రెడ్డి, బి.ఆనందరావు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధికి దాతల సాయం అభినందనీయం

ప్రజాశక్తి - ఆలమూరు

చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు చేస్తున్న సాయం అభినందనీ యమని ఆలయ ఇఒ వీర్రాజు చౌదరి అన్నారు. ఆలయ అభివృద్ధికి గుమ్మిలేరుకు చెందిన పారిశ్రామిక వేత్తలు వంకా అన్నవరం, వైట్ల కనకదుర్గారావు, తదితర పార్టనర్స్ కలసి రూ.2 లక్షలు శుక్రవారం ఇఒకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ ఆలయానికి తూర్పు, పడమర దిక్కులల్లో రెండు వైపులా ప్రత్యేకంగా దాతల సహకారంతో గోపురాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వైట్ల శేషుబాబు, తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ సంఘాలతో పార్టీ బలోపేతం

ప్రజాశక్తి - మామిడికుదురు

యువజన విభాగాల ద్వారా గ్రామాల్లో పార్టీ బలోపేతం అవుతుందని రాజోలు నియోజకవర్గం వైసిపి ఇన్ఛార్జి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. శుక్రవారం రాజోలు నియోజకవర్గానికి చెందిన రాజోలు, మామిడికుదరు మండలాల యువజన విభాగం అధ్యక్షులు ఎన్నిక వైసిపి నాయకుడు కటకంశెట్టి ఆదిత్య ఇంటి వద్ద కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గొల్లపల్లి మాట్లాడుతు యువజన విభాగం అనేది రాజకీయంగా చాలా బలమైన పాత్ర అని, గ్రామాల్లో గ్రూపులను ఏకం చేసుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులకు, కార్యకర్తలను కోరారు. అనుబంధ విభాగాలకు తగిన ప్రాధాన్యతనిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని ముందుకు తీసుకు వెళ్లే విధంగా చూడాలన్నారు. పదవులు తీసుకున్న నాయకులు పార్టీ కోసం కష్టపడి పనిచేయాల న్నారు.కార్యక్రమంలో ఎంపిపి కుసుమ వనజకుమారి శ్రీధర్, భూపతి రాజు సత్తిబాబు రాజు, కంచర్ల శేఖర్, పాటి శివకుమార్, కట్టా శ్రీనివాసరావు, బొలిశెట్టి భగవాన్, కుసుమ చంద్రశేఖర్, గుర్రం జాషువా, గుబ్బల మనోహర్ కూనపరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతున్న ప్రత్తిపాడు మండలం ఏజెన్సీ ప్రాంతమైన బవురువాక గ్రామానికి చెందిన జలుమూరు నాగేశ్వరరావును శుక్రవారం ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ వైసిపి నేత ముదునూరి మురళీ కృష్ణంరాజు పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. నాగేశ్వరరావుకు ట్రస్ట్ తరపున రూ.5000 వేల ఆర్థిక సాయం అందజేశారు. మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ట్రస్ట్ తరపున నియోజకవర్గంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కష్టకాలంలో ఉన్న పేదలను ఆదుకోవ డానికి ట్రస్ట్ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, వైస్ సర్పంచ్ వెంకటరమణ, సతీష్ రాజు, బొల్లు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇప్పించాలి

ప్రజాశక్తి-గండేపల్లి

రామేశ్వరంపేటలో ఇటీవల ఎడిబి రోడ్డు విస్తీర్ణంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు అదేచోట ఇళ్లు కట్టి ఇవ్వాలని బాధితులు కోరారు. శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో రామేశ్వరంపేటలో బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ భావన మాట్లాడారు. రామేశ్వరంపేటలో ప్రభుత్వ స్థలాలు లేవని గండేపల్లిలో స్థలాలతో పాటు ఇళ్లు కట్టి ఇస్తామని తెలిపారు. ప్రస్తుతం రోడ్డు విస్తీర్ణంలో భాగంగా పనులు వేగవంతంగా జరగడం వల్ల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడు రోజులు ముందే బాధితులకు సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీఉసకుంటామని తెలిపారు. ఎవరికైన ఇబ్బందులు ఉంటే వెంటనే తహశీల్దారుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డిఒ శ్రీరమణి పాల్గొన్నారు.

రికార్డ్ అసిస్టెంట్ నాగమణికి సన్మానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్డిఒ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్గా నాగమణి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆమెను ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆర్డిఒ కార్యాలయంలో జరిగిన సభలో ఆర్డిఒ కె.శ్రీరమణి నాగమణిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఒ కార్యాలయం ఎఒ మాధవరావు, డిప్యూటీ తహశీల్దారు భాను కుమార్, ఆర్డిఒ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి -కరప

కరప మండలం కొంగుడు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఎస్డబ్ల్యుపిసి కేంద్రాలను శుక్రవారం మండల పంచాయతీ విస్తరణాధికారి ఎస్.వెంకట శ్రీనివాసరావు పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యం ద్వారా వచ్చే చెత్తను, తడి పొడిగా వేరు చేసి చెత నుండి సంపద కేంద్రాలకు తరలించి కంపోస్టు ఎరువులు తయారీకి ఉపయోగించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయాలని పలు సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రత, మంచినీటి వనరులను శుభ్రంగా ఉంచడం వంటి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందికి ఆదేశించారు.

కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా ప్రభాకరరావు


ప్రజాశక్తి - మండపేట

రాష్ట్ర కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షునిగా కామన ప్రభాకరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే ఉత్తర్వులు జారీ చేసి నట్లు శుక్రవారం కామన తెలిపారు. నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మూడు సార్లు ఆయన ఎంఎల్ఏగా పోటీచేశారు. ఆరు సార్లు పిసిసి సభ్యులు గా పనిచేశారు. మూడు సార్లు ఏఐసిసి సభ్యులు గా భాద్యతలు నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు.

పశువులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని ముత్యమల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్య శిబిరంలో 92 పశువులను పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ ఎడి ఒ.రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాడి పశువులకు వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. సమారా 50 మంది పాడి రైతులు కార్యక్రమాలకు హాజరయ్యారు. పశు వైద్యులు డాక్టర్ ఎం.కృష్ణార్జున పాల్గొన్నారు.



విద్యుత్ లైన్ మారుస్తున్న అధికారులు

కేశవ స్వామి కాలనీలో విద్యుత్ లైన్ మార్పు

ప్రజాశక్తి- తాళ్లరేవు

గత కొన్నేళ్లుగా తాళ్ళరేవు పంచాయతీ కేశవ స్వామి కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులు శుక్రవారంతో తీరాయి. కేశవ స్వామి కాలనీ గృహాల పైనుంచి ఉన్న 33/11 కెవి.విద్యుత్ లైన్ను శుక్రవారం మార్పు చేశారు. కాలనీలోని 16 గృహాల పైనుంచి ఉన్న విద్యుత్తు లైను గత కొన్నేళ్లుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విద్యుత్తు లైను వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి సంబంధించి 2011లో కాలనీలోని ఒక డాబాపైన పని చేస్తుండగా ఒక వ్యక్తి మృతి చెందిన సంగతి విదితమే. ప్రజల ఇబ్బందులను గమనించి ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు సుమారు 400 మీటర్ల మేర విద్యుత్తు లైనును కేశవ స్వామి కాలనీ సెంటర్లో మార్చడంతో కాలనీ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఎఇ సుబ్రహ్మణ్యం, ఎల్ఐ అప్పారావు, ఎస్ఎల్ఐ.చక్రపాణి, లైన్మెన్ సూరిబాబు, జెఎల్ఎం.సాయి, ప్రకాష్, కృష్ణ, స్థానికులు రెడ్డి రెడ్డిబాబు, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.